

రైతు చెంతకు పరిశోధన ఫలితాలు

రైతులు అధిక దిగుబడి, ఆదాయం పొందేందుకు పరిశోధన ఫలితాలు దోహదపడతాయని ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకురాలు ఎల్.ప్రశాంతి తెలిపారు. - 8లో



'కోట'లో తెలుగు తమ్ముళ్ల కుమ్ములాట

ఎస్.కోట టీడీపీలో వర్గపోరు బహిర్గతమైంది. ఇరువర్గాలు కుమ్ములాటకు సిద్ధమయ్యాయి. - 8లో



రైతుల సమక్షంలోనే సర్వే రాళ్లు

బొబ్బిలి: భూముల రీసర్వే పూర్తయిన గ్రామాల్లో హద్దు రాళ్లను రైతుల సమక్షంలోనే పాతాలని ఆర్డీఓ పి.శేష శైలజ రెవెన్యూ, సర్వే సిబ్బందిని ఆదేశించారు. ఎం.పణుకువలసలో సర్వే సిబ్బందికి బుధవారం పలు సూచనలిచ్చారు.

న్యూస్‌రీల్

పలువురు డీఎస్పీలకు బదిలీలు

విజయనగరం క్రైమ్: రాష్ట్ర వ్యాప్తంగా డీఎస్పీలను బదిలీలు చేస్తూ రాష్ట్ర డీజీపీ కె.వి.రాజేంద్రరెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. సీఐడీ విభాగంలో డీఎస్పీలుగా పనిచేస్తున్న ఎస్.కాళిదాస్ విజయనగరం డీఎస్పీగా, వి.గిరిధర్ బొబ్బిలి డీఎస్పీగా రానున్నారు. కొత్తగా ఏర్పాటైన చీపురపల్లి సబ్ డివిజన్‌కు ఎ.ఎస్.చక్రవర్తిని నియమించారు. అలాగే, గ్రేహౌండ్స్ డీఎస్పీగా పనిచేస్తున్న సునీల్‌షేరాన్ పార్వతీపురం ఏఎస్పీగా బదిలీ అయ్యారు. బొబ్బిలి డీఎస్పీగా పనిచేస్తున్న బి.మోహనరావు ఇంటిలిజెన్స్ డీఎస్పీగా బదిలీ అయ్యారు. పార్వతీపురం డీఎస్పీగా పనిచేస్తున్న ఎ.సుభాష్ హెడ్‌క్వార్టర్‌కు, దిశ డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న ఎమ్.వెంకటేశ్వర్లు రాజమండ్రి ట్రాఫిక్ డీఎస్పీగా బదిలీ అయ్యారు.

అరుణాచలం గిరిప్రదర్శనకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు



కె.శ్రీనివాసరావు

విజయనగరం టౌన్: అరుణాచల గిరిప్రదక్షిణ చేయాలనుకునే భక్తులకు ఏపీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్ సర్వీసులను ఏర్పాటుచేసినట్టు జిల్లా ప్రజారవాణాధికారి కె.శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. కాణిపాకం, శ్రీపురం, అరుణాచలం, కంచి, శ్రీకాళహస్తి క్షేత్రాల దర్శనం ఉంటుందన్నారు. మే 3వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు బస్సు బయలుదేరి 5న పౌర్ణమిరోజున అరుణాచల స్వామి వారిని దర్శించుకునే అవకాశం కల్పిస్తారన్నారు. ప్రత్యేక బస్ సర్వీసులకు ఏపీఎస్ఆర్టీసీ ఆన్‌లైన్ డాట్ ఇన్ వెబ్‌సైట్ ద్వారా గానీ, నేరుగా గానీ టికెట్లు బుక్ చేసుకోవచ్చన్నారు. వివరాలకు 9959225604, 7382 924083 నంబర్లను సంప్రదించాలన్నారు.

29న వైఎస్సార్‌సీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం

- హాజరుకానున్న టీటీడీ చైర్మన్, పలువురు రాష్ట్ర మంత్రులు

విజయనగరం: వైఎస్సార్‌సీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం ఈనెల 29న నిర్వహించనున్నట్టు జెడ్పీచైర్మన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం 3 గంటలకు నగరంలోని పూల్‌బాగ్‌ప్రాంతంలోని జగన్నాథ ఫంక్షన్ హాల్‌లో జరిగే సమావేశానికి టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామితో పాటు జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు హాజరవుతారని పేర్కొన్నారు. వచ్చే నెల 3వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా చేపట్టబోయే భోగాపురం అంతర్జాతీయ గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణ పనుల శంకుస్థాపన కార్యక్రమాన్ని విజయవంతం చేయడంపై పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేస్తారన్నారు. సమావేశానికి జిల్లాలోని వివిధ హోదాల్లో ఉన్న ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

బహిరంగ సభను విజయవంతం చేయాలి

- ప్రజలకు పిలుపునిచ్చిన జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



ముఖ్యమంత్రి సభాస్థలాన్ని పరిశీలించి సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ దీపిక పాటిల్

విజయనగరం గంటస్తంభం: భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి ఈ నెల 3వ తేదీన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. ఈ నేపథ్యంలో జెడ్పీ సమావేశమందిరంలో నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు నెల్లిమర్ల నియోజకవర్గంలోని నాలుగు మండలాల నాయకులతో బుధవారం సమావేశమయ్యారు. భోగాపురం మండలం సవరవల్లి వద్ద ఏర్పాటు చేయనున్న భారీ బహిరంగ సభకు ప్రజలకు పెద్ద సంఖ్యలో హాజరయ్యేలా ప్రతి ఒక్కనాయకుడు, కార్యకర్త కృషిచేయాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్ బాబు, నెల్లిమర్ల నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు అందవరపు సూరిబాబు, నియోజకవర్గంలో నాలుగు మండలాల్లోని ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

సభాస్థలి పరిశీలన

భోగాపురం ఎయిపోర్ట్ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రసంగించే సభా స్థలి ప్రాంతానఇన ఎస్పీ దీపిక పాటిల్ బుధవారం పరిశీలించారు. సభావేదిక, పార్కింగ్, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ తదితర అంశాలపై సిబ్బందితో చర్చించారు. కార్యక్రమంలో సీఐ విజయనాథ్, ఎంపీడీఓ డి.బంగరయ్య, వైఎస్సార్‌సీపీ నాయకుడు సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతన్నకు యంత్ర సాయం

- జిల్లాలో 500 కస్టమ్ హైరింగ్ సెంటర్లు
- ఇప్పటి వరకు 328 సీహెచ్‌సీల పరిధిలోని రైతులకు రాయితీపై పరికరాలు
- దీనికోసం రూ.9 కోట్ల రాయితీ నిధుల కేటాయింపు
- మిగిలిన 172 సీహెచ్‌సీల పరిధిలోనూ యంత్రాలు అందజేత
- రాయితీ నిధులు రూ.3 కోట్ల కేటాయింపు



సీహెచ్‌సీలకు అందించిన ట్రాక్టర్

విజయనగరం ఫోర్ట్:

వ్యవసాయ రంగానికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. విత్తనాల నుంచి పంట కొనుగోలు వరకు రైతులకు సహకారం అందిస్తోంది. ఏటా వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.13,500 చొప్పున పెట్టుబడి సాయం రైతుల ఖాతాలకు జమ చేస్తోంది. ఆధునాతన పద్ధతిలో వ్యవసాయం చేసేందుకు అవసరమైన యంత్ర పరికరాలను రాయితీపై అందిస్తోంది. సాగులో యాంత్రీకరణను ప్రోత్సహిస్తోంది. వ్యవసాయంలో కూలీల కొరతను, సమయాన్ని, సాగు ఖర్చును తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రైతుభరోసా కేంద్రాల ద్వారా యంత్రాలను సమకూర్చుతోంది. ప్రభుత్వం ఇచ్చిన ప్రోత్సాహంతో రైతులు ఉత్సాంగా ముందుకు 'సాగు'తున్నారు.

జిల్లాలో 500 కస్టమ్ హైరింగ్ సెంటర్లు

జిల్లాలో 500 కస్టమ్ హైరింగ్ సెంటర్లు(సీహెచ్‌సీలు) ఉన్నాయి. ఒక్కో సెంటర్‌లో ఐదుగురు రైతులతో కూడిన గ్రూపును ఏర్పాటు చేశారు. గ్రూపులో ఉన్న సభ్యులు తమకు నచ్చిన వ్యవసాయ పనిముట్లను ఎంపిక చేసుకుని ప్రభుత్వం నుంచి రాయితీపై పొందవచ్చు. ఇప్పటివరకు 328 కస్టమ్ హైరింగ్ సెంటర్ల (సీహెచ్‌సీ)లకు యంత్ర పరికరాలను ప్రభుత్వం సరఫరా చేసింది. దీనికోసం రాయితీ రూపంలో రూ.9 కోట్ల నిధులు వెచ్చించింది. ఇంకా మిగిలి ఉన్న 172 సీహెచ్‌సీలకు యంత్ర పరికరాలు అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. వీటిలో 126 సీహెచ్‌సీల పరిధిలోని రైతులు తమకు కావాల్సిన యంత్ర పరికరాల కోసం తమ వాటా చెల్లించారు. వీరికి రాయితీరూపెన ప్రభుత్వం రూ.3 కోట్లు చెల్లించనుంది. మిగిలిన 36 సెంటర్లు యంత్ర పరికరాలు తీసుకునేలా వ్యవసాయ అధికారులు చర్యలు చేపడుతున్నారు. 84 మంది ఇప్పటి వరకు ట్రాక్టర్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు.

సీహెచ్‌సీల్లో అందించే పరికరాలు:

రైతులు సూచించిన కంపెనీలకు చెందిన వ్యవసాయ పనిముట్లనే ప్రభుత్వం సరఫరా చేస్తోంది. ట్రాక్టర్లు, పవర్ టిల్లర్, స్ప్రేయిర్, మినీ ట్రా క్టర్, కల్టివేటర్ వంటి పరికరాలను ప్రభుత్వం రాయితీపై అందజేస్తోంది. వీటిని పొందిన రైతు గ్రూపులు మిగిలిన రైతులకు అద్దె ప్రాతిపదికన ఇచ్చుకోవచ్చు.

సాగు లాభదాయకంగా...



వ్యవసాయం లాభదాయకంగా సాగాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. తక్కువ పెట్టుబడి, సులభ పద్ధతుల్లో పంటల సాగుకు అనువుగా రైతులకు రాయితీపై యంత్రాలను అందిస్తోంది. ఇప్పటికే సీహెచ్‌సీల ద్వారా రెండు విడతల్లో పరికరాలు పంపిణీ చేసింది. దీనికోసం కోట్లాది రూపాయల నిధులను రాయితీపై ఖర్చు చేస్తోంది. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. యంత్రాలతో పంటలు సాగు చేసి అధిక దిగుబడులు పొందాలి.

– వి.తారకరామారావు, జిల్లా వ్యవసాయ అధికారి

నైపుణ్యాత్మక విద్యతో ప్రగతి

- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ



సెమినార్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ, సభ్యురాలు గెద్దం ఉమ, వీసీ కట్టిమణి

విజయనగరం అర్బన్: నైపుణ్యాత్మక విద్యతో దేశ ప్రగతి సాధ్యమని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ అన్నారు. స్థానిక కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో 'కెపాసిటీ బిల్డింగ్ అండ్ పర్సనాలిటీ డెవలప్మెంట్' అనే అంశంపై బుధవారం నిర్వహించిన సెమినార్‌కు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాంకేతిక విద్యపై విద్యార్థులు మక్కువ పెంచుకోవాలన్నారు. ఆరోగ్యకరమైన సమాజానికి యువత నడుంబిగించాలని పిలుపునిచ్చారు. మార్కుల కోసం కాకుండా చదువులో నైపుణ్యత్‌పై దృష్టి సారించాలన్నారు. డిమాండ్ ఉన్న కోర్సులను అభ్యసించాలన్నారు. సోషల్ మీడియాతో కాలక్షేపం చేస్తే కెరీర్ దెబ్బతింటుందన్నారు. బాల్య వివాహాలు, చదువు మానివేయడం వంటివి పేదరికం పెరిగేందుకు సూచికలుగా పేర్కొన్నారు. ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలలను బలోపేతం చేస్తేనే పేదవారికి విద్యా అవకాశాలు లభిస్తాయని భావించి ప్రభుత్వం నాడు నేడు, జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన వంటి పథకాలను అమలు చేస్తోందన్నారు. వైద్య రంగంలో కూడా ఫ్యామిలీ డాక్టర్, ఫిజీషియన్ కాన్సెప్ట్‌తో ప్రజల ముంగిటకే వైద్యాన్ని అందించడం జరుగుతోందన్నారు. గిరిజనుల కోసం ఒక ప్రత్యేక యూనివర్సిటీని నెలకొల్పడం గొప్ప విషయమని, భవిష్యత్తులో అతి పెద్ద క్యాంపస్‌గా వెలుగొందుతుందని ఆకాంక్షించారు.

మహిళా కమిషన్ సభ్యురాలు గెద్దం ఉమ మాట్లాడుతూ గిరిజ ప్రాంతాల్లో అనేక బాల్య వివాహాలు జరుగుతున్నాయని ఈ వ్యవస్థను మార్చడంలో యువత కీలక పాత్ర వహించాలని కోరారు. లింగ వివక్షలేని సమాజానికి నడుంబిగించాలని పిలుపునిచ్చారు. సభాధ్యక్షత వహించిన గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి మాట్లాడుతూ యువత ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దానిని సాధించడమే కర్తవ్యంగా భావించాలన్నారు. నేర్చుకోవడం అనేది నిరంతర ప్రక్రియ కావాలన్నారు. కార్యక్రమంలో లెండి కళాశాల వైస్ ప్రెసిడెంట్ హరిబాబు తమ్మినేని, బయోటెక్ డిపార్టుమెంట్ హెచ్ఓడీ డాక్టర్ దివ్య, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్ ఎస్ఏడీపాల్ తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు అండగా..

- కలెక్టర్ నాగలక్ష్మి



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ అశోక్

విజయనగరం అర్బన్: విభిన్న ప్రతిభావంతులకు అన్ని విధాలుగా అండగా ఉండాలని కలెక్టర్ నాగలక్ష్మి .ఎస్ పిలుపునిచ్చారు. విభిన్న ప్రతిభావంతుల ప్రయోజనాలు, హక్కులను కాపాడేందుకు కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న ప్రయోజనాలు, పథకాలు విభిన్న ప్రతిభావంతులకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్య, వైద్య పరమైన సహాయం అందించేందుకు స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవాలని సూచించారు. ఈ నెలాఖరులోగా బ్యాక్‌లాగ్ ఖాళీలను భర్తీ చేయాలని విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులను కలెక్టర్ ఆదేశించారు. వారికి స్కిల్ డవలప్‌మెంట్ శిక్షణ ఇచ్చి, ఉపాధి కల్పించాలన్నారు. జిల్లా సర్వజన ఆస్పత్రిలో దివ్యాంగుల కోసం ప్రత్యేక సెల్ ఏర్పాటుచేసి, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించారు. జేసీ మయూర్ అశోక్ మాట్లాడుతూ.. చెవిటి, మూగ దివ్యాంగుల సమాచార మార్పిడి కోసం ప్రత్యేక యాప్‌లు ఉన్నాయని, వాటిని వినియోగించాలని సూచించారు. సమావేశంలో విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకుడు జగదీష్, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

దేవుడా.. నాకు దిక్కెవరు..!

- కారు రూపంలో కుమారుడిని కాటేసిన మృత్యువు
- తల్లి కళ్లముందే ఘోరం
- స్కూల్ అడ్మిషన్‌కు వెళ్లి వస్తూ అనంత లోకాలకు..
- యువతికి తీవ్ర గాయాలు
- చీపురుపల్లి-గరివిడి ప్రధాన రోడ్డులో ప్రమాదం



కొడుకును కోల్పోయిన ఘటనలో రోదిస్తున్న తల్లి, కుటుంబ సభ్యులు

చీపురుపల్లిరూరల్(గరివిడి):



కారు ఢీకొనడంతో మృతి చెందిన మదన్

కొడుకు పుట్టిన కొన్ని నెలలకే భర్త చనిపోయాడు.. కొడుకునే సర్వస్వంగా భావించి కాయకష్టం చేస్తూ సాకుతున్నాను.. ప్రయోజకుడిని చేస్తే కష్టాలు తొలగుతాయని భావించాను.. వాడులేని జీవితం నాకెందుకు... నాకు దిక్కెవరు దేవుడా.. నన్నూ తీసుకుపో.. అంటూ ఓ తల్లి పెట్టిన కన్నీరు అక్కడివారిని కంటతడి పెట్టించింది. ఆదుకుంటాడనుకున్న కుమారుడిని కారు రూపంలో మృత్యువు కాటేయడంతో బోరున విలపించింది.

గరివిడి- చీపురుపల్లి ప్రధాన రోడ్డులో ఎస్‌డీఎస్ డిగ్రీ కళాశాలకు ఎదురుగా బుధవారం సాయంత్రం 5 గంట ల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లి కళ్లముందే కొడుకు తనువు చాలించగా, ఆ కుటుంబానికి చెందిన ఇంటర్మీడియట్ చదువుతున్న మరో విద్యార్థిని తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..

కందిపేట గ్రామానికి చెందిన సారిక సంతోషి, తన కుమారుడు మదన్(12), వైజాగ్‌లో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతూ సెలవులకు పిన్ని ఇంటికి వచ్చిన రౌతుస్వప్న ముగ్గురూ కలిసి సైకిళ్లపై గరివిడిలో ఓ ప్రవేటు స్కూల్‌కు వెళ్లారు. కందిపేట ప్రభుత్వ పాఠశాలలో ఐదోతరగతి పూర్తి చేసిన మదన్‌ను ఆరో తరగతిలో ప్రైవేట్ స్కూల్‌లో చేర్పించారు.

అనంతరం సంతోషి ఒక సైకిల్‌పైన, స్వప్న, మదన్ మరో సైకిల్‌పై గరివిడి వైపు నుంచి చీపురుపల్లి వైపు వస్తుండగా, వెనుక నుంచి వచ్చిన కారు పిల్లల సైకిల్‌ను బలంగా ఢీకొంది. ప్రమాదంలో మదన్, స్వప్న తీవ్రంగా గాయపడ్డారు. మదన్ మార్గం మధ్యలో తల్లి ఒడిలోనే తనువు చాలించాడు. స్వప్న తల, కాళ్లు, చేతులకు తీవ్రగాయాలయ్యాయి. విజయనగరం ఆస్పత్రికి రిఫర్ చేశారు. గరివిడి ఎస్ఐ ఎల్.ధామోదర్‌రావు కేసు నమోదు చేశారు. కారు డ్రైవర్ మద్యం సేవించి పిల్లలకు ఢీకున్నట్టు స్థానికులు చెబుతున్నారు.

ఇంటర్మీడియట్ ఫలితాల్లో..

బాలికలదే హవా

విజయనగరం పూల్‌బాగ్:

ప్రభుత్వం బుధవారం విడుదలచేసిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో బాలికలే పైచేయి సాధించారు. అధిక శాతం ఉత్తీర్ణతతో ముందంజలో నిలిచారు. విజయనగరం ఉమ్మడి జిల్లాలో ఇంటర్ ఫస్టియర్ పరీక్షలకు 18,839 మంది హాజరుకాగా 8,603 మంది ఉత్తీర్ణత (47 శాతం)సాధించారు. అలాగే, సెకెండియర్ పరీక్షలకు 17,113 మంది విద్యార్థులు హాజరుకాగా 9,815 మంది(57శాతం) ఉత్తీర్ణులైనట్టు ఆర్ఐఓ మజ్జి సత్యనారాయణ తెలిపారు. ఫస్టియర్‌లో బాలురు 58 శాతం ఉత్తీర్ణత సాధించగా, బాలికలు 65 శాతం ఉత్తీర్ణతతో హవా సాగించారు.



జయలక్ష్మి (ఎంపీసీ-976)



కె.లావణ్య (ఎంపీసీ-969)



ఎం.రాధిక (ఎంఎల్‌టీ-958)



కె.హేమలత (బైపీసీ-947)



కరణం నాగమణి (ఎంపీసీ-971)



చౌదాన రాజేశ్వరి (ఎంపీసీ-945)



పూసర్ల రేణుక (ఎంపీసీ-934)



రుంకాన గాయంత్రి (ఎంపీసీ-461)

ప్రభుత్వ కళాశాలల విద్యార్థుల ప్రతిభ

నెల్లిమర్ల: ఇంటర్మీడియట్ ఫలితాల్లో నెల్లిమర్ల పట్టణంలోని సీకేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు కేజీబీవీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాల విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించారు. కేజీబీవీ విద్యార్థినులు సీనియర్ ఇంటర్లో 78 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఎంపీసీ గ్రూపునకు చెందిన 27 మంది పరీక్షలు రాయగా 21 మంది ఉత్తీర్ణులయ్యారు. పి.జయలక్ష్మి 976 మార్కులతో కళాశాల టాపర్‌గా నిలిచింది. 969 మార్కులతో కె.లావణ్య ద్వితీయ స్థానంలోనూ, 920 మార్కులతో పి.భవాని తృతీయ స్థానంలో నిలిచారు.

ప్రభుత్వ కళాశాలలో...

సీకేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి సెకెండియర్ పరీక్షలకు 245 మంది హాజరుకాగా, 153 మంది ఉత్తీర్ణులయ్యారు. 63 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ ఎంఎల్‌టీ విద్యార్థిని ఎం.రాధిక 958 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచింది. బైపీసీ విద్యార్థినులు కె.హేమలత 947 మార్కులు, పి ఇందుమతి 942 మార్కులు సాధించారు. ఎంపీసీ విద్యార్థిని వై.సిరి 941 మార్కులు సాధించింది.

వంగర: మండలంలోని మద్దువలస డా.బి.ఆర్. అంబేడ్కర్ గురుకుల కళాశాల నుంచి ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులు 64 మందికి 52 మంది, సెకెండియర్ విద్యార్థులు 75 మందికి 65 మంది ఉత్తీర్ణులయ్యారు. మద్దువలస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫస్టియర్ విద్యార్థులు 122 మంది 76 మంది, సెకెండియర్ విద్యార్థులు 117 మందికి 89 మంది ఉత్తీర్ణత సాధించారు. ఎంపీసీ విభాగంలో కరణం నాగమని 971 మార్కులు, చౌదాన రాజేశ్వరి 945 మార్కులు, పూసర్ల రేణుక 934 మార్కులు సాధించారు.

దత్తిరాజేరు: మండలంలోని పోరలి గ్రామానికి చెందిన విద్యార్థిని రుంకాన గాయత్రి మొదటి సంవత్సరం ఎంపీసీలో 470కు 461మార్కులు సాధించి సత్తా చాటింది.

సత్తా చూపారు...



ప్రణతి (ఎంపీసీ-988)ని అభినందిస్తున్న అధ్యాపకుడు

బొబ్బిలి: ఇంటర్మీడియట్ ఫలితాల్లో బొబ్బిలి విద్వాన్ జూనియర్ కళాశాలకు చెందిన పక్కి సాయిప్రవల్లిక బైపీసీలో 986 మార్కులు సాధించింది. ఏవీఎస్ వైష్ణవి, బంకురు పార్వతిలు ఎంపీసీ గ్రూపులో 986 మార్కులు సాధించారు. ఫస్టియర్ ఎంపీసీలో గెంబల సాయి లక్ష్మి 463, గొట్టాపు చరణ్ సాయి 462 మార్కులు సాధించారు. వాసు కళాశాలకు చెందిన ఎం.పి.ప్రణతి ఎంపీసీలో 988 మార్కులు, ఎస్.మంజూష 982, డి.చందన 980 మార్కులు సాధించారు. బైపీసీ సెకెండియర్‌లో ఆర్.సంతోషి-982 మార్కులు సాధించింది. ఫస్టియర్ ఎంపీసీలో సీహెచ్ పావని-464, వి.వరుణ్ 462, వి.వినయ్ 461, ఆర్.భార్గవి 460, బైపీసీలో ఆర్.జ్యోతి 426 మార్కులు సాధించారు.

గొట్లాం గాయత్రీ విద్యార్థుల ప్రతిభ



పి.లీలాప్రసాద్ (ఎంపీసీ-988)



ఎన్.భారతి (ఎంపీసీ-986)



జి.కృష్ణ (ఎంపీసీ-463)

బొండపల్లి: ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్ష ఫలితాల్లో గొట్లాంలోని గాయత్రీ కాళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. సెకెండియర్ ఫలితాల్లో ఎంపీసీ విభాగంలో పి.లీలాప్రసాద్ 988, ఎం.యశ్వంత్, ఎన్.బారతి 986 మార్కులు సాధించారు.

ప్రథమ సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీ విభాగంలో జి.కృష్ణ, జి.హరీష్, ఎన్.రవీంద్రలు 463 మార్కులను సాధించినట్టు ప్రిన్సిపాల్ బి.మురళీ తెలిపారు.

పేద పిల్లల బంగారు భవిష్యత్తుకు బాసట

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు
- జగనన్న వసతి దీవెన కింద 43,980 మందికి రూ.42 కోట్ల సాయం



జగనన్న వసతి దీవెన పథకం చెక్కును విద్యార్థులకు అందజేస్తున్న జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ సురేష్‌బాబు, కలెక్టర్ నాగలక్ష్మి తదితరులు

విజయనగరం అర్బన్: పేదకుటుంబాల పిల్లల బంగారు భవిష్యత్తుకు ప్రభుత్వం బాసటగా నిలుస్తోందని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. 2022-23 విద్యాసంవత్సరానికి సంబంధించి జగనన్న వసతి దీవెన మొదటి విడత నిధులను ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అనంతపురం జిల్లా నార్పల నుంచి బుధవారం మీటనొక్కి విద్యార్థుల తల్లుల ఖాతాలకు జమచేశారు. కార్యక్రమాన్ని విజయనగరం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ నాగలక్ష్మి, ఎమ్మెల్సీ డాక్టర్ సురేష్‌బాబు, వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన, విద్యార్థుల తల్లిదండ్రులు తిలకించారు. జిల్లా విద్యార్థులకు వసతిదీవెన కింద విడుదలపై రూ.42 కోట్ల విలువ గల మెగా చెక్కును అందజేశారు. అనంతరం జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ విద్యారంగానికి ప్రభుత్వం తొలి ప్రాధాన్యమిస్తోందన్నారు. జగనన్న అమ్మఒడి, వసతి దీవెన, విద్యాదీవెన పథకాలతో చదువుకు ఆర్థిక సహకారం అందిస్తోందని చెప్పారు. ఈ విద్యా సంవత్సరంలో మొదటి విడతలో భాగంగా ఉమ్మడి జిల్లాకు సంబంధించి 61,298 మంది విద్యార్థులకు రూ.58 కోట్లు ఆర్థిక లబ్ధి చేకూరిందని పేర్కొన్నారు. పేద కుటుంబాల విద్యార్థులు ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకుని చక్కగా చదువుకోవాలని పిలుపునిచ్చారు. చదువుతోనే భవష్యత్ మారుతుందన్నారు.

43,980 మందికి ఆర్థిక ప్రయోజనం

2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి విజయనగరం జిల్లా నుంచి 43,980 మంది విద్యార్థులు జగనన్న వసతి దీవెన పథకం కింద లబ్ధిపొందారని కలెక్టర్ నాగలక్ష్మి సెల్వరాజన్ వెల్లడించారు. విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.42 కోట్లు జమచేస్తున్నట్టు వెల్లడించారు. లబ్ధి పొందిన వారిలో బీసీ వర్గానికి చెందిన వారు 35,866 మంది, ఎస్సీ విద్యార్థులు 3,793 మంది, ఈబీసీ నుంచి 2,553 మంది, కాపు సామాజికవర్గం నుంచి 941 మంది, ఎస్టీవర్గం నుంచి 521 మంది, ముస్లిం, క్రిస్టియన్ వర్గాల నుంచి 306 మంది ఉన్నట్టు కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ డీడీ రత్నం, ట్రైబల్ వెల్ఫేర్‌డీడీ చంద్రశేఖర్, బీసీ వెల్ఫేర్ అధికారి సుదర్శనరావు, మైనారిటీ వెల్ఫేర్ అధికారిణి లావణ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

కనుల పండువగా సీతారామ కల్యాణం



సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

విజయనగరం రూరల్: మండలంలోని కోరుకొండ రోడ్డులో ఉన్న ఆధ్యాత్మిక కేంద్రం రామనారాయణంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని బుధవారం వేడుకగా నిర్వహించారు. పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకులు పీవీజె చాణక్య, జీఎస్ హర్ష ఆధ్వర్యంలో ఉదయం 7 గంటలకు స్నపనం, పంచామృతాభిషేకం, సహస్రనామ కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం వేదమంత్రాల నడుమ సీతారాముల కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌సీఎస్ ట్రస్టీలు నారాయణం శ్రీనివాస్, నీరజవల్లి దంపతులు, మేనేజర్లు శ్రీనివాసరాజు, ఎంవీ రమణ, భక్తులు పాల్గొన్నారు.

కస్తూర్బా సిబ్బందికి గాయాలు

భోగాపురం: మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాల సిబ్బందికి తీవ్ర గాయాల పాలైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. విద్యార్థులు, సిబ్బంది తెలిపిన వివరాలు.. పాఠశాలలో ఉదయం అంబలి కోసం స్టౌపై మరుగుతున్న నీరు ఒక్కసారిగా కింద పడిపోవడంతో అక్కడే ఉన్న వంట కుక్‌తో పాటు నైట్ వాచ్‌మేన్ దుర్గభవానీకి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వారిని చికిత్స నిమిత్తం సుందరపేట సీహెచ్‌సీకి తరలించారు.

జెడ్పీహెచ్ పాఠశాలలో ఆకతాయిల విధ్వంసం



పాఠశాలలో విరగ్గొట్టిన ఫ్యాన్లు, బెంచీలు

సాలూరు: మండలంలోని మామిడిపల్లి గ్రామంలో జెడ్పీహెచ్ పాఠశాలలో ఫ్యాన్లు, బెంచీలు, గొట్టాలు ఇతర సామగ్రిని కొందరు ఆకతాయిలు విరగ్గొట్టి విధ్వంసం సృష్టించారు. బుధవారం ఉదయం పాఠశాలకు వెళ్లిన ఉపాధ్యాయులు గదుల్లో ఫ్యాన్లు, బెంచీలు విరిగి ఉండడం, ఏసీ పాడవ్వడం, బాత్‌రూంలలో గొట్టాలు విరిగి ఉండడాన్ని గుర్తించారు. వెంటనే హెచ్‌ఎం కామేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూరల్ ఎస్‌ఐ ప్రయోగమూర్తి పాఠశాలకు చేరుకుని పరిశీలించారు. విచారణ చేపట్టారు.

తాగునీరు వచ్చిందోచ్...



శిలిగాం ఈతమానుగూడలో ట్యాంకర్ల ద్వారా నీరు ఇస్తున్న సిబ్బంది

సీతంపేట: ఈ వేసవిలో నీటి ఎద్దడి ఉన్న గిరిశిఖర గ్రామాలకు తాగునీటి సరఫరాకు సంబంధిత గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు చర్యలు తీసుకున్నారు. ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి చొరవతో యుద్ధ ప్రాతిపదికన ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా ప్రారంభించారు. మొత్తం 69 గ్రామాలను అత్యంత నీటి ఎద్దడి గ్రామాలుగా గుర్తించారు. దీనిలో మొదటిగా 35 గ్రామాలను ఎంపిక చేసి పంపిణీ చేస్తున్నారు. మిగతా 34 గ్రామాలకు మే 15 నుంచి నీటి ఎద్దడి ఉంటుందనే ఉద్దేశంతో వారికి అప్పటి నుంచి సరఫరా చేయనున్నారు. తాగునీటి సమస్య తమ గ్రామాలకు ఉందంటూ పలు గ్రామాల గిరిజనులు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లినపుడు ఎమ్మెల్యే కళావతి దృష్టికి తీసుకువెళ్లారు. ఐటీడీఏలో ప్రతీ సోమవారం జరిగే గిరిజన స్పందనలో కూడా ప్రాజెక్టు అధికారికి వినతులు సమర్పిస్తున్నారు. దీని దృష్ట్యా వెంటనే తాగునీటిని సప్లై చేయాలని ఐటీడీఏ పీఓ ఆదేశించడంతో ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ పవన్‌కుమార్ పర్యవేక్షణలో రెండు రోజుల కిందట నుంచి ప్రక్రియ ప్రారంభించారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 450.00
విజయనగరం	రూ. 454.00
శ్రీకాకుళం	రూ. 454.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	61,040–00
బంగారం(22సి. 10గ్రా.)	55,950–00
వెండి (కిలో)	80,200–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹115	₹200	₹ 210

రైతు చెంతకు పరిశోధన ఫలితాలు

- ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకురాలు ప్రశాంతి



హాజరైన రైతులు, శాస్త్రవేత్తలు



మాట్లాడుతున్న పరిశోధన వ్యవసాయ సంచాలకురాలు ప్రశాంతి

పార్వతీపురం: రైతులు అధిక దిగుబడి, ఆదాయం పొందేందుకు వారికి పరిశోధన ఫలితాలు ఉపయోగపడతాయని ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకురాలు ఎల్.ప్రశాంతి తెలిపారు. గరుగుబిల్లి మండలంలోని ఉద్యాన కళాశాలలో బుధవారం ఉన్నత పర్వత శ్రేణి గిరిజన మండల పరిశోధన మరియు విస్తరణ సలహా మండలి సమావేశం నిర్వహించారు. పరిశోధన సంచాలకురాలు ఎల్.ప్రశాంతి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చింతపల్లి, సీతంపేట, రస్తాకుటుంబాయి పరిశోధనా కేంద్రాలలో అధిక దిగుబడినిచ్చే నూతన వంగడాలు, తెగుళ్ల నివారణ, సేంద్రీయ వ్యవసాయ పద్ధతులపై పరిశోధనలు జరుగుతున్నాయని, పరిశోధన ఫలితాలను రైతులకు అందించి వారు మంచి ఫలితాలు సాధించేందుకు రైతులను ఈ కార్యక్రమంలో భాగస్తులను చేస్తున్నట్లు తెలిపారు. సేంద్రీయ సాగును ప్రోత్సహించాలని, సేంద్రీయ పంటలకు సర్టిఫికేషను చేసి మార్కెటు విలువ పెరిగే విధంగా ప్రోత్సహించాలన్నారు. రసాయన ఎరువులు పరిమితికి మించి వాడకూడదని, భూ పరీక్షలు నిర్వహంచి శాస్త్రవేత్తలు సూచించిన మోతాదులోనే వినియోగించాలన్నారు. గిరిజన ప్రాంతాలలో సేంద్రీయ విధానంలో పండించే పంటలను విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చి అమ్మడం ద్వారా వారికి అధిక ఆదాయం వస్తుందని తెలిపారు. రైతులకు ఎక్కువ ఆదాయం రావాలంటే డిమాండు గల పంటలను పండించాలని చింతపల్లిలో విదేశీ పూల సాగుపై పరిశోధనలు సాగుతున్నాయని, కొన్ని రకాల పూలను వాణిజ్య సరళిలో పండించుటకు రైతులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. గిరిజన ప్రాంతాలలో ప్రధాన పంటలైన రాజ్ మా వంటి పంటలలో అధిక దిగుబడినిచ్చే వంగడాలను రైతులకు అందిస్తున్నట్లు తెలిపారు. అగ్రి టూరిజం అభివృద్ధి చేయాలని, విద్యార్థులకు వ్యవసాయ క్షేత్రాలు సందర్శించే ఏర్పాట్లు చేయాలని, పాఠ్యాంశంగా చేర్చాలన్నారు. చింతపల్లి పరిశోధనా కేంద్రం అసోసియేట్ డైరెక్టర్ ఎం.సురేష్‌కుమార్ మాట్లాడుతూ చింతపల్లి, సీతంపేట, రస్తాకుంటుంబాయి పరిశోధనా కేంద్రాలలో నిర్వహిస్తున్న పరిశోధనలు గురించి వివరించారు. రాజ్ మా, కందిలో అధిక దిగుబడి నిచ్చే నూతన వంగడాలు ప్రవేశ పెట్టినట్లు తెలిపారు. మార్కెటులో డిమాండు గల విదేశీ పూల సాగును వాణిజ్య సరళిలో పండించేందుకు రైతులను ప్రోత్సహిస్తున్నామని, ఇప్పటికే ఔత్సాహికులైన కొందరు రైతులు ప్రయోగాత్మకంగా పండిస్తున్నారన్నారు. చింతపల్లి పరిశోధనా కేంద్రంలో గ్లాడియోలస్, చైనా ఆస్టర్, బంతి, లిలియం, జెర్బరా పూలు పండిస్తున్నామని, కొత్తగా తులిప్ పూలను సాగు చేసి జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించడం జరిగిందన్నారు. ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు ఎ.సుబ్బరామరెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ కూలీల కొరతను ఎదుర్కొంటున్న ప్రస్తుత పరిస్థితులలో వ్యవసాయంలో యాంత్రీకరణ, నూతవ వ్యవసాయ విధానాలను విస్తరించవలసిన అవసరం ఉందన్నారు. ప్రతి జిల్లాకు ఒక రైతు శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. శాస్త్రవేత్తలు పి.సీతారాం, పి.శ్రీనివాసరాజు, పి.జోగారావు, ఎం.అనంత విహారి, ఎస్.వంశీకృష్ణ, ఎం.శ్రీనివాసరావు, సౌజన్య, పి.వెంకటరావు, జి.చిట్టిబాబు, అను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



పార్టీ కార్యాలయంలో కేక్‌ను కట్ చేస్తున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య దంపతులు

గజపతినగరం : వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ముందుగా విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ఎమ్మెల్యే అప్పలనరసయ్యను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, నారాయణమూర్తిరాజు, ప్రభూజీరాజుతో పాటు గజపతినగరం, దత్తిరాజేరు, బొండపల్లి, గంట్యాడ, జామి మండలాల జెడ్పీటీసీలు, ఎంపీపీలు, మండల పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు, అభిమానులు పార్టీ కార్యాలయానికి చేరుకొని ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సుమారు 60 కేజీల కేక్‌ను ఎమ్మెల్యే అప్పలనరసయ్య, సతీమణి దేవి అనురాధ కట్ చేశారు. అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గార తవుడు, బెల్లాన త్రినాధరావు, మండల సురేష్, బూడి వెంకటరావు, కరణం ఆదినారాయణ, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య దంపతులను పూలమాలతో సత్కరిస్తున్న ఐదు మండలాల నేతలు, అభిమానులు

దత్తిరాజేరు: స్థానిక ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య పుట్టిన రోజు వేడుకలు గజపతినగరం క్యాంపు కార్యాలయంలో బుధవారం జరిగాయి. ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు, జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి, వైస్ ఎంపీపీలు బమ్మిడి అప్పలనాయుడు, మిత్తిరెడ్డి రమేష్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు కడుబండి రమేష్‌నాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు సుమల శ్రీను ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

జగనన్నను మళ్లీ సీఎంను చేద్దాం..

- ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర



ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొరకు స్వాగతం పలుకుతున్న ప్రజలు, నాయకులు

సాలూరు: ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఆశీర్వదించి రానున్న ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా చేయాలని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర కోరారు. మండలంలో తుండ పంచాయితిలో తుండ, ఇటికివలస, జోడిమామిడివలస, ఒడ్డువలస, తాడివలస గ్రామాల్లో ఎంపీడీఓ పార్వతి ఆధ్వర్యంలో సర్పంచ్ సీదరపు నూకయ్య, ఎంపీటీసీ మర్రి ఆదయ్యల అధ్యక్షతన బుధవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఉప ముఖ్యమంత్రి రాజన్నదొరకు థింసా నృత్యాలు, మేళతాళాలు, బాణసంచాలతో ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి ప్రతి ఇంటికి వెళ్లి జగనన్న పాలనలో పథకాల ద్వారా ఎంత లబ్ధి చేకూరిందో వివరించారు. ఒడ్డువలస, తాడివలస, ఇటివలస గ్రామస్తులు బీటీ రోడ్డు కావాలని కోరారు. తాడివలసలో తాగునీటి ట్యాంక్ ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా అత్యంత పారదర్శకంగా అవినీతి రహితంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వివరించారు. గిరిజనులకు అండగా నిలుస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, ఏఎంసీ చైర్‌పర్సన్ దండి అనంతకుమారి, వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, దండి శ్రీనివాసరావు, పీడిక సుదర్శనదొర, సువ్వాడ రామకృష్ణ, భరత్‌శ్రీనివాస్, బీసు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం సునాయాస విజయం

- అండర్– 23 విభాగంలో శ్రీకాకుళం జట్టుపై 9 వికెట్ల తేడాతో గెలుపు
- సర్ విజ్జీ మైదానంలో ఏసీఏ ఆధ్వర్యంలో అంతర్ జిల్లాల వన్డే టోర్నీ ప్రారంభం



ఎం.రవికిరణ్



దుర్గాప్రశాంత్



దుర్గాకుమార్

విజయనగరం/విజయనగరం రూరల్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సర్ విజ్జీ మైదానంలో బుధవారం ప్రారంభమైన అంతర్ జిల్లాల అండర్ – 23 పురుషుల వన్డే టోర్నీలో శ్రీకాకుళం జట్టుపై విజయనగరం జట్టు విజయం సాధించి బోణి చేసింది. విజయనగరం, శ్రీకాకుళం జట్ల మధ్య జరిగిన వన్డే మ్యాచ్‌లో టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ ప్రారంభించిన శ్రీకాకుళం జట్టును విజయనగరం జట్టు బౌలర్లు ఎం.రవికిరణ్ (8 ఓవర్లలో 5 వికెట్లు), దుర్గాప్రశాంత్ (10 ఓవర్లలో 4 వికెట్లు) కట్టడి చేశారు. వీరిద్దరూ పోటాపోటీగా వికెట్లు పడగొట్టడంతో శ్రీకాకుళం జట్టు 22.2 ఓవర్లలో 73 పరుగులకే ఆలౌటైంది. ఆ ఇట్టు మొత్తం స్కోర్ కంటే ఎక్స్‌ట్రాల రూపంలో వచ్చిన పరుగులే (30) అత్యధికం కావడం విశేషం. ఆ జట్టు మిడిలార్డర్ బ్యాటర్ మహమూద్ ఒక్కడే (14 పరుగులు) రెండంకెల స్కోర్ సాధించడం విశేషం. అనంతరం స్వల్ప లక్ష్య చేధనలో బ్యాటింగ్‌కు దిగిన విజయనగరం జట్టు కేవలం 10.4 ఓవర్లలో 77 పరుగులు సాధించి ఘన విజయాన్ని అందుకుంది. ఆ జట్టు ఓపెనింగ్ బ్యాటర్లు సాయి సందీప్ (21 బంతుల్లో 14 పరుగులు), ఎస్.హరీష్ (32 బంతుల్లో 21 పరుగులు నాటౌట్) తొలి వికెట్‌కు 41పరుగులు సాధించగా, ఫస్ట్ డౌన్‌లో వచ్చిన కెప్టెన్ జె.దుర్గాకుమార్ ధాటిగా ఆడి (14 బంతుల్లో 4 ఫోర్లు, రెండు సిక్సర్ల సాయంతో 31 పరుగులు నాటౌట్) మ్యాచ్‌ను ముగించాడు.

వైద్య విద్యార్థులకు గాయాలు

లక్కవరపుకోట : మండలంలోని అరకు – విశాఖ రోడ్డు ఎల్.కోట పాత బస్టాప్ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న బ్రిడ్జి వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాలకు చెందిన వైద్య విద్యార్థులు పలువురు గాయాల పాలయ్యారు. మహమద్ నవాజ్, జి.చిన్మయిలు రంగరాయ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ అభ్యసిస్తున్నారు. వీరు విశాఖపట్నంలో ఒక ద్విచక్ర వాహనాన్ని అద్దెకు తీసుకొని అరకు అందాలు చూసేందుకు వెళ్తుండగా ద్విచక్ర వాహనం అదుపు తప్పి పడిపోయారు. దీంతో వీరు తీవ్ర గాయాలు కాగా స్థానికుల సహాయంతో ఎల్.కోట పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భోగాపురం: మండలంలోని తూడెం గ్రామానికి చెందిన నీలాపు సత్యం(62) తగరపువలస ఎస్‌ఆర్‌ఐ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతి చెందినట్టు ఎస్‌ఐ కృష్ణమూర్తి తెలిపారు. మృతుని బంధువులు, పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని తూడెం గ్రామానికి చెందిన నీలాపు సత్యంకు భార్య అప్పలకొండతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. సత్యం మందుకు బానిస కావడంతో అతని ఆరోగ్యం దెబ్బతింది. దీంతో సత్యం ప్రతిరోజు మందులు వాడుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం సత్యం మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. ఆరోగ్యం బాగోలేదు కదా మళ్లీ ఎందుకు మందు తాగావంటూ భార్య అప్పలకొండ భర్తను నిలదీసింది. దీంతో సత్యం మనస్తాపానికి గురై ఇంటికి 100 మీటర్ల దూరంలో ఉన్న పశువుల శాల వద్దకు వెళ్లి పురుగుల మందు సేవించాడు. చీకటి పడుతున్న భర్త ఎంతకీ ఇంటికి రాకపోవడంతో భార్యకు అనుమానం వచ్చి పశువుల శాల వద్దకు వెళ్లింది. అప్పటికే భర్త పురుగుల మందు తాగి వాంతులు చేసి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. దీంతో భార్య అప్పలకొండ కుటుంబ సభ్యులతో కలిసి ఆటోలో భర్తను తగరపవలస ఎన్‌ఆర్‌ఐ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సత్యం మంగళవారం అర్ధరాత్రి మృతి చెందాడు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

ఆర్మీ జవాన్...



నగరపు అరుణ్‌కుమార్ (ఫైల్)

పాలకొండ రూరల్: మండలంలోని అవలంగి గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ నగరపు అరుణ్‌కుమార్ (36) అరుణాచల్‌ప్రదేశ్‌లో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తూ ఈ నెల 24న తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందాడు. గడిచిన 14 ఏళ్లుగా విధుల్లో ఉన్న అరుణ్‌కుమార్ మరణ వార్త ఉన్నతాధికారులు తమకు తెలియజేశారని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతదేహం ఇంకా రావాల్సి ఉంది. మృతునికి భార్య రోజాకుమారితో పాటు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

'కోట'లో తెలుగు తమ్ముళ్ల కుమ్ములాట

- గంట పాటూ ఉద్రిక్తత
- సర్ది చెప్పిన పోలీసులు
- గొంపను అడ్డుకున్న తమ్ముళ్లు



ఇరు వర్గాల దేశం నేతలకు సర్ది చెబుతున్న ఎస్‌ఐ

శృంగవరపుకోట: కొంత కాలంగా వర్గాల కుమ్ములాటలతో రగిలిపోతున్న తెలుగుదేశం కుంపటి ఒక్కసారిగా రాజుకుంది. ఇన్నాళ్లూ చాపకింద నీరులా ఉన్న వర్గపోరు ఒక్కసారిగా పెల్లుబికింది. బుధవారం సాయంత్రం 7గంటలకు శృంగవరపుకోట పట్టణంలో శ్రీనివాసకాలనీలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమాన్ని పార్టీ యువనేత గొంప కృష్ణ ప్రారంభించారు. స్థానిక షిర్డీసాయి గుడి వద్ద పూజా కార్యక్రమాలు చేసిన గొంప కృష్ణ, చిప్పాడ రమణాజీ, సత్యం, చిరంజీవి, రాయవరపు చంద్రశేఖర్, మంగరాజు తదితర కార్యకర్తలతో కలసి శ్రీనివాసకాలనీలో ప్రచారానికి సిద్ధమయ్యారు. అదే సమయంలో ఎస్.కోట పట్టణానికి చెందిన తెలుగుదేశం వార్డు సభ్యులు, నాయకులైన మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి వర్గీయులు నానిగిరి రమణాజీ, సి.హెచ్.కిరణ్, పి.రాజు, కె.వాసు, వాకాడ బాలు తదితరుల సమక్షంలో కార్యకర్తలు ఏకమై గొంప కృష్ణ వర్గాన్ని శ్రీనివాసకాలనీలోకి రాకుండా అడ్డుకున్నారు. దీంతో రెండు వర్గాల మధ్య తీవ్ర వాగ్యుద్ధం మొదలైంది. పార్టీ కోసం పార్టీ పెద్దల ఆదేశాలకు అనుగుణంగా పార్టీ కార్యక్రమాలు చేస్తున్నామని, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలం, నాయకులమని చెప్పుకుంటూ పార్టీ కార్యక్రమాలను ఎలా అడ్డుకుంటారని గొంప కృష్ణ వర్గీయులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇందుకు ప్రతిగా పూర్వం నుంచి పార్టీ కోసం త్యాగాలు చేసి, రాజకీయం కోసం ఆస్తులు అమ్ముకుని పార్టీని నిలబెట్టిన కార్యకర్తల్ని పట్టించుకోకుండా వదిలేసి, కొత్తగా వచ్చి, పార్టీని వర్గాలుగా చీల్చేసే నాయకుల్ని ఎలా రానిస్తాం.. ఇలాంటి తప్పుడు రాజకీయాలు చేస్తే పార్టీనీ నమ్ముకున్న కార్యకర్తలు ఏమౌతారంటూ వాదనకు దిగారు. గొంప కృష్ణ వీరికి నచ్చచెప్పే యత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. దీంతో తీవ్ర గందరగోళం ఏర్పడింది. రోడ్డు మీద రెండు వర్గాలు కుమ్ములాడుకున్నారు. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరువర్గాలకు నచ్చజెప్పారు. రోడ్డు మీద పంచాయతీలను అనుమతించేది లేదని, ట్రాఫిక్‌కు ఇబ్బంది పెడితే కేసులు పెడతామని హెచ్చరించారు. ఇరు వర్గాల వారు కూర్చుని సమన్వయం చేసుకోవాలని సూచించారు. రెండు వర్గాల నాయకుల అభ్యంతరాలు, వాదనలతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఎట్టకేలకు గొంప కృష్ణ వర్గీయులు శ్రీనివాసకాలనీలోకి వెళ్లే ఆలోచన విరమించుకుని దేవీ జంక్షన్ వైపు వెళ్లటంతో గొడవ సద్దు మణిగింది.



శ్రీనివాసకాలనీ ఎదుట రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న లలితకుమారి వర్గీయులు

ఔరా.. అనిపించేలా...



రామభద్రపురంలోని మొదటి దశలో 20 గదులతో రూపుదిద్దుకున్న ఉన్నత పాఠశాల



బూసాయవలస కేజీబీవీ ఆవరణలో అదనపు తరగతి గదుల నిర్మాణం



పాడివానివలస ప్రాథమిక పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న నాడు - నేడు డీఈఈ జగ్గారావు

రాష్ట్రంలోని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక పాఠశాలల రూపురేఖలే మారిపోయాయి. నాడు - నేడు ద్వారా కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా తీర్చిదిద్ది ఔరా.. అనిపిస్తున్నారు. సకల సదుపాయాలతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చర్యలు చేపట్టారు. రామభద్రపురం మండలంలో నాడు - నేడు మొదటి విడతలో 25 పాఠశాలలను ఎంపిక చేసి సుమారు రూ.4.50కోట్లు వెచ్చించి ఔరా.. అనిపించారు. ప్రస్తుతం రెండో విడతలో మరో 21 పాఠశాలల్లో అదనపు తరగతి గదులతో పాటు మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టారు. ఈ పనులు జోరుగా సాగుతున్నాయి. రెండో విడతలో ఇప్పటి వరకు రూ.1.50కోట్లు ఖర్చు చేసినట్టు సమాచారం. మొత్తంగా జగనన్న పాలనలో మారుతున్న బడులను చూసి ఇటు విద్యార్థులు, అటు తల్లిదండ్రులు మురిసిపోతున్నారు.

– రామభద్రపురం